నరకానికి నకళ్లు.. ఈ దారులు!

- గుంతలమయంగా డీ.చెక్కవారిపల్లి రోడ్డు
- అధ్వానంగా ఈసీపల్లి రోడ్డు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు


అధ్వానంగా ఉన్న డీసీ పల్లి రోడ్డు


కంకర తేలిన ఎగువ చెక్కవారిపల్లి రోడ్డు

తనకల్లు: మండలంలోని కొన్ని గ్రామీణ రహదారులు నరకానికి నకళ్లుగా మారాయి. ఆ దారుల గుండా వెళ్లాలంటేనే వాహనదారులు భయందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రం నుంచి గోళ్లవారి పల్లి మీదుగా ఎస్వీపురం (చీకులగుట్ట) వరకు ఉన్న తారురోడ్డు పూర్తిగా పాడైంది. అలాగే ఓరువాయి నుంచి డీ. చెక్కవారిపల్లి వరకు ఉన్న తారురోడ్డు వర్షాలకు రోడ్డంతా కంకర తేలి, గుంతలమయంగా మరిపోయింది. దీంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గాల గుండా దాదాపు 20 గ్రామాల ప్రజలు, వాహనదారులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రాకపోకలను సాగిస్తున్నారు.

తరచూ ప్రమాదాలు..

రోడ్డు మరమ్మతు చేపట్టాలని ఎన్నిసార్లు చెప్పినా పాలకులు కాని, అధికారులు కాని పట్టించుకున్న పాపాన పోలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్ల గుండా మండల కేంద్రంతో పాటు నల్లచెరువు, కదిరికి వివిధ పనుల నిమిత్తం ఆటోలు, ద్విచక్రవాహనాల్లో ప్రయాణిస్తుంటారు. అయితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయాందోళనలతో రాకపోకలు సాగిస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే ఈ రోడ్లపై ప్రయాణం చేస్తూ అనేక మంది ప్రమాదాలకు గురైనట్లు గుర్తు చేస్తున్నారు. తమ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక అనేక తిప్పలు పడుతున్నా సంబంధిత అధికారులలో ఎలాంటి చలనం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు, నాయకులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులను చేపట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు



చాలారోజులుగా ఒరువాయి–డీ. చెక్కవారిపల్లి రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కంకర తేలిపోవడంతో పాటు గుంతలు పెద్దవిగా ఉండడంతో రోజూ ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది. రోడ్డు మరమ్మతు చేపట్టాలని ఇప్పటికే అధికారుల దృష్టికి చాలాసార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, సర్పంచ్, దిగువ చెక్కవారిపల్లి

రోడ్డంతా దుమ్మే



మా ఊరి తారురోడ్డు మొత్తం కంకర తేలిపోయింది. ఏదైనా వాహనం వెళితే రోడ్డంతా దుమ్ముదుమ్ముగా ఉంటుంది. రోడ్డుపై గుంతలు చాలా ఉన్నాయి. ద్విచక్ర వాహనంలో పోవాలన్నా చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రమాదాల మధ్య ప్రయాణం చేస్తున్నాం. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నాం.

–వేమయ్య, డీసీపల్లి

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


రిజిస్టర్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్

నల్లచెరువు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులు, పిల్లల హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నిర్దేశించిన మెనూ ప్రకారం ఎప్పటికప్పుడు పాలు, గుడ్లు, పౌష్టికాహారం అందజేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు. కార్యక్రమంలో వీఆర్ఏ పతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ


రికార్డు పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి వీరమ్మ

నల్లచెరువు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా నోడల్ అధికారి, ప్రోగ్రాం ఆఫీసర్ వీరమ్మ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న కాన్పులపై అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, బాలింతలు, చిన్న పిల్లలకు అందించే వైద్య సేవను మెరుగు పరచడానికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండల వైద్యాధికారి కల్పన రెడ్డి, సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, ఫార్మాసిస్ట్ చిన్నయ్య, ల్యాబ్ టెక్నీషియన్ శంకర, ఏఎన్ఎంలు మంజుల,శోభ, హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు.

మున్సిపల్ లైసెన్స్‌డ్ సర్వేయర్ గుండెపోటుతో మృతి


రాఘవ(ఫైల్)

ధర్మవరం అర్బన్: మున్సిపల్ లైసెన్స్‌డ్ సర్వేయర్ గురువారం రాత్రి గోకర్ణ సమీపంలో గుండెపోటుతో మృతి చెందాడు. బాధితులు తెలిపిన వివరాలు.. ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ బెస్త రాఘవ(30) తన స్నేహితులతో కలిసి పుణ్యక్షేత్రాలకు వెళ్లాడు. ధర్మస్థలం, గోకర్ణ పుణ్యక్షేత్రాలు చూసుకుని కారులో తిరిగి ధర్మవరం వస్తుండగా గోకర్ణ సమీపంలో ఫిట్స్‌తో పాటు గుండెపోటు రావడంతో స్నేహితులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి చేర్చారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య అంజలి ఉంది. సంతానం లేదు. మృతుని తండ్రి రవి మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మృతదేహాన్ని ధర్మవరానికి తీసుకురావడంతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి మృతునికి నివాళులర్పించి బాధితులను పరామర్శించారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


అధికారిని సత్కరిస్తున్న వ్యవసాయాధికారులు, సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: ఉద్యోగులు అంకిత భావంతో పని చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై కడప జిల్లాకు బదిలీపై వెళ్లిన వెంకటేషును వ్యవసాయశాఖ ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. వెంకటేషుకు దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఏడీఏలు సత్యనారాయణ, కృష్ణమీనన్, కృష్ణయ్య, మండల వ్యవసాయాధికారులు, ఏఈఓలు పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేయొద్దు

అమడగూరు: మండల వ్యాప్తంగా ఉన్న మీ సేవ కేంద్రాల నిర్వాహకులు సర్టిఫికెట్లకు అధిక చార్జీలు వసూలు చేయొద్దని తహసీల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. శుక్రవారం వారు గాజులపల్లి సమీపంలో ఉన్న ఆదర్శపాఠశాలలో ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో మీ సేవ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ సర్టిఫికెట్లకు అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకే డబ్బు తీసుకోవాలని లేనిపక్షంలో మీ సేవ కేంద్రాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులకు అధిక చార్జీలు వసూలు చేస్తే 7981528287 నంబరుకు కాల్ చేయాలన్నారు.

తపాలా కార్యాలయానికి జనాల క్యూ


గాండ్లపెంట తపాలా కార్యాలయం వద్ద ఖాతా తెరవడానికి వచ్చిన మహిళలు

గాండ్లపెంట: ప్రతి మహిళకు(19 నుంచి 50 ఏళ్ల లోపు) నెలకు రూ.1500 అందాలంటే తపాలా కార్యాలయంలో ఖాతాలు తెరవాలని పుకార్లు షికార్లు చేస్తుండడంతో తపాలా కార్యాలయానికి ఖాతా తెవరడానికి మహిళలు తరలివస్తున్నారు. ఇప్పటికే కొందరు బ్యాంకు ఖాతాలు ఉన్నవారు ఆధార్, ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని ప్రచారం జరుగుతోంది. దీంతో మహిళలు ఖాతాలు తెరవడానికి తపాలా కార్యాలయాల వద్ద క్యూ కడుతున్నారు. అయితే ప్రభుత్వం రూ.1500 పథకంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇలాంటి పుకార్లను నమ్మొద్దని అధికారులు తెలుపుతున్నారు. ఈ విషయంపై తపాలా పోస్టుమాస్టర్ మూర్తిని వివరణ కోరగా.. సంక్షేమ పథకాలు, ఉపాధి పనుల వేతనాల కోసం 'ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంకు' ఖాతా తెరవాలని అధికారుల ఉత్తర్వుల మేరకు గ్రామీణ డాక్ సిబ్బంది ఖాతాలు చేస్తున్నారని చెప్పారు. రూ.1500 పథకం లాంటి విషయాలు తమకు తెలియవన్నారు.

మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎస్ఈకి వినతిపత్రం అందిస్తున్న మీటర్ రీడర్స్

పుట్టపర్తి టౌన్: విద్యుత్ మీటర్ రీడర్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా మీటర్ రీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ కూడలి నుంచి ఎస్సీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి విద్యుత్ ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఇంటింటికీ తిరుగుతూ విద్యుత్ బిల్లులు తీసి ఇస్తున్నారని, అలాంటి వారికి ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని దీనివల్ల రీచార్జ్ చేసుకొనే సౌకర్యం వినియోగదారులకు కల్పించడంతో మీటర్ రీడర్స్ కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఉద్యోగులకు వేధింపులు మెదలయ్యాయని, చాలా చోట్ల ఉద్యోగులను తొలగిస్తామని బెదిరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మీటర్ రీడర్స్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు షానవాజ్, కోశాధికారి దస్తగిరి, మీటర్ రీడర్స్ పాల్గొన్నారు.

ఏఎస్ఐ సేవలు మరువలేనివి


షామీర్‌బాషా దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న ఎస్పీ రత్న, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: ఏఆర్ ఏఎస్ఐ షామీర్‌బాషా సేవలు మరువలేనివని ఎస్పీ రత్న పేర్కొన్నారు. షామీర్‌బాషా ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ రత్నా ఏఆర్ ఏఎస్ఐ సేవలను కొనియాడారు. అనంతరం ఏఎస్ఐ దంపతులను పూలమాలలు, దుశ్శాలువా సత్కరించడంతోపాటు జ్ఞాపిక అందజేశారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐలు వలీ, మహేష్, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసులు ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఎస్ఐలు వెంకటేశ్వర్లు, వీరన్న, ఏఆర్ ఏఎస్ఐ శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

అమడగూరు: మండల వ్యాప్తంగా శనివారం పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. 1 వ తేదీ ఆదివారం కావడంతో ముందు రోజే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలవ్యాప్తంగా 4,859 మందికి రూ.2.09 కోట్లు పంపిణీ చేస్తామన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట


పూజలందుకున్న గంగమ్మ విగ్రహం

కదిరి టౌన్: కుటాగుళ్ల సమీపంలోని మామిడితోట వద్ద బైలు గంగమ్మ అమ్మవారు విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా జరిగింది. కుటాగుళ్లకు చెందిన దేశగారి చెన్నప్ప రూ.3 లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. ఉదయం నుంచి ఆలయంలో హోమాలు, పూజలు జరిగాయి. వేద పండితులు అమ్మవారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

తీరిన తాగునీటి సమస్య

అమడగూరు: నరసన్నగారిపల్లిలో తాగునీటి సమస్య తీరింది. గ్రామానికి మంచినీటి పథకం బోరు లేక గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయితే గ్రామస్తుల విన్నపం మేరకు సర్పంచ్ సరస్వతమ్మ శుక్రవారం బోరును వేయించారు. బోరులో పుష్కలంగా నీరు పడటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించి, మోటారు, పంపు బిగించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కదిరి టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీకి చెందిన చంద్ర(53) మూడు రోజుల క్రితం బైక్‌పై వెళ్తుండగా వేమారెడ్డి సర్కిల్ వద్ద ఆటో ఢీకొనింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం, తర్వాత తిరుపతికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గుల పోటీలు


ఆసుపత్రి వద్ద ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్న అధికారులు

కదిరి టౌన్: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ ముగ్గులను పరిశీలించి ఉత్తమ ముగ్గులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ బహుమతులను డిసెంబరు1న అందజేయనున్నట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. డాక్టర్ హేమంత్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది వెంకటేశ్వర చౌదరి, రాజేష్ బాబూ, రవి, చాంద్‌బాషా, సురేంద్ర, లలిత తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అర్థమయ్యేలా గురజాడ రచనలు


మాట్లాడుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

ధర్మవరం అర్బన్: సామాన్యులకు సైతం అర్థమయ్యేలా వాడుకభాషలో గురజాడ అప్పారావు రచనలు చేశారని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురజాడ రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి అని కొనియాడారు. కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, దిద్దుబాటు ఇలా అనేక రచనలతో ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని తన రచనల ద్వారా ప్రజలను ఆకట్టుకున్న వ్యక్తి గురజాడ అని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర్ పాల్గొన్నారు.

జీఓ 117ను ఉపసంహరించుకోవాలి


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి

తనకల్లు: జీఓ 117ను వెంటనే ఉపసంహరించుకోవాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మురళీధర్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో ఏపీ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన డీఏలు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, బోధనేతర విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓలు లలితమ్మ, కళ్యాణి చేతుల మీదుగా సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఉపాధ్యాయులు శివశంకర్, రమణ, రామచంద్ర, ప్రకాష్, మారుతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బస్సులను కండీషన్‌లో ఉంచాలి


కార్మికులతో మాట్లాడుతున్న సీఎంఈ రమేష్ బాబు

పుట్టపర్తి టౌన్: బస్సులను ఎల్లప్పుడూ కండీషన్‌లో ఉంచాలని ఆర్టీసీ ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ సీఎంఈ రమేష్‌బాబు సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన పుట్టపర్తి డిపో గ్యారేజ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్యారేజ్ విడిభాగాలు, బస్సుల కండీషన్, పరిశుభ్రత, కాలం చెల్లిన బస్సులను పరిశీలించి కార్మికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. బస్సుల మరమ్మతు, నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు. బస్సు డిపోలోకి చేరగానే కావాల్సిన మరమ్మతులు చేసి కండీషన్‌లో ఉంచాలన్నారు. ప్రధానంగా బస్సులు అధిక మైలేజీ వచ్చేలా చూడాలన్నారు. సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు సిబ్బంది తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎం ఇనయతుల్లా, ఎంసీ విజయానంద, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ


ఎస్పీ రత్నకు మొక్క అందజేస్తున్న డీఎస్పీ ఆదినారాయణ

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మహిళా పోలీస్‌స్టేషన్ నూతన డీఎస్పీగా బి.ఆదినారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆయనకు సూచించారు. ఇదిలా ఉండగా డీఎస్పీ ఒంగోలు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

తనకల్లు: ప్లాట్ ఇప్పిస్తానని చెప్పి డబ్బు తీసుకొని మోసం చేసిన సోమ్లానాయక్, అతని భార్య, కుమారుడిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. సోమ్లానాయక్ టీ. నదుంకు చెందిన షామీర్, ఖాజాపీర్ అనే వ్యక్తులకు సున్నపుట్టగుట్టతండా రింగ్ రోడ్డు వద్ద రెండు ప్లాట్లు ఇప్పిస్తానని చెప్పి రూ. 4 లక్షలు 2018లో తీసుకున్నాడు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్లాట్లు కానీ డబ్బు కానీ ఇవ్వలేదు. అలాగే షామీర్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ చికిత్స కోసం అదే సోమ్లానాయక్ వద్ద ఇంటి పత్రాలను పెట్టి రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. అనంతరం ఆ డబ్బును షామీర్ తిరిగి సోమ్లానాయక్‌కు చెల్లించాడు. ఇంటి డాక్యుమెంట్లు ఇవ్వాలని అడిగితే సోమ్లానాయక్, అతని కుమారుడు, భార్యతో కలిసి షామీర్‌ని చంపుతామని బెదిరించారు. బాధితులు షామీర్, ఖాజాపీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

'మెగా' సమావేశం జయప్రదం చేయండి

పుట్టపర్తి: విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిర్వహించే డిసెంబర్ 7న మెగా సమావేశాన్ని విజయవంతం చేయాలని విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కోన శశిధర్ అధికారులను కోరారు. మెగా సమావేశ నిర్వహణపై శుక్రవారం ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించగా జిల్లా నుంచి డీఈఓ కృష్ణప్ప పాల్గొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు కార్యక్రమం జయప్రదం చేయడానికి ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ కృషి చేయాలని ఆయన ఆదేశించారు.

నేడు 'ప్రజావేదిక'

తాడిమర్రి: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం సామాజిక తనిఖీపై ప్రజావేదిక(బహిరంగ సభ) నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట రంగారావు శుక్రవారం తెలిపారు. మండలంలోని గ్రామాల్లో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 మధ్య జరిగిన ఉపాధి హామీ పనులపై తనిఖీలు పూర్తయ్యాయన్నారు. బహిరంగ సభలో సామాజిక తనిఖీలో నమోదు చేసుకున్న వివరాలను సామాజిక తనిఖీ బృందాలు వెల్లడిస్తారని తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు హాజరు కావాలని ఆయన కోరారు.

మెగా పేరెంట్స్ మీటింగ్‌కు సన్నద్ధం


చెన్నేకొత్తపల్లి: వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన హెచ్‌ఎంలు, ఇతర సిబ్బంది

కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో డిశంబర్ 7న మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహణకు అందరూ సన్నద్ధం కావాలని కనగానపల్లి ఎంఈఓ అరుణమ్మ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మెగా పేరెంట్స్ మీటింగ్‌పై శుక్రవారం కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి ఎంఈఓ కార్యాలయాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పేరెంట్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ రామన్న, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధ వ్యవసాయం మేలు

తలుపుల : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రణాళికాబద్ధ వ్యవసాయమే మేలని డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. గొల్లపల్లితండాలో సీఎస్ఏ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం పంట నీరు ప్రణాళికపై అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఏ పంట ఎంతమేర నీరు ఎలా వినియోగించాలి అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌సీ శ్యామల, సీఆర్పీలు పుష్ప, మునేసులు, రమణ, లక్ష్మీదేవి, సుజిత, శారద, అనూష, రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు కంటి పరీక్షలు


విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్‌పీకుంట: స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 250 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించగా 17 మందికి కంటిచూపులో లోపం ఉన్నట్లు గుర్తించామని, వీరికి ప్రభుత్వం కంటి అద్దాలు అందిస్తుందని ఆప్తాలిమిక్ అధికారి గణేష్‌రెడ్డి తెలిపారు. మండల విద్యాధికారి సుబ్బిరెడ్డి శిబిరాన్ని పరిశీలించి, విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రిహానా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక పూజలు


పెడపల్లి సోమేశ్వరాలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు

పుట్టపర్తి అర్బన్: కార్తీక మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెడపల్లి సోమేశ్వరాలయం, నిడిమామిడి వీరభద్రాలయం, కప్పలబండ, మామిళ్లకుంట క్రాస్ సాయి దర్బార్ ఆలయం, శివలింగ మందిరం తదితర చోట్ల స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. మహిళలు పెద్దసంఖ్యలో ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

ధాబాలు, హోటళ్లలో మద్యం విక్రయిస్తే చర్యలు

తనకల్లు: ధాబాలు, హోటళ్లలో మద్యం సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గోపి హెచ్చరించారు. మండలంలోని పలు ధాబాలు, హోటళ్లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం నిర్వాహకులు, యజమానులతో ఎస్ఐ మాట్లాడారు. డాబాలు, హోటళ్లలో మద్యాన్ని అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ధాబాలు, హోటళ్లలో మద్యాన్ని అనుమతించినా, అమ్మినా యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.